లస్కర్ల భర్తీకి ప్రభుత్వం చర్యలు

- జిల్లాలో 170 మంది అవసరం
- వీఆర్‌ఏలను లష్కర్లుగా నియమించే అవకాశం?

సారంగాపూర్: కాల్వలకు లస్కర్ల భర్తీకి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది. ఇప్పటికే చాలా ఏళ్లుగా లస్కర్ల నియామకం జరగకపోవడంతో కాల్వలపై పర్యవేక్షణ తగ్గిపోయింది. దీంతో రైతులు సాగు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం లస్కర్లను నియమించే దిశగా జగిత్యాల నీటిపారుదల శాఖ అధికారులతో ఉన్నతస్థాయి అధికారులు శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లాకు ఎంత మంది లస్కర్లు అవసరం అన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించి, డివిజన్‌ల వారిగా వివరాలు తీసుకున్నట్లు తెలిసింది. జగిత్యాల జిల్లాలోని 18 మండలాల్లో ఎస్సారెస్పీ కింద మొత్తం 90 వేల ఎకరాలు భూమి సాగు అవుతోంది. ఎస్సారెస్పీ నీటిని పర్యవేక్షించేందుకు మొత్తం 12 సబ్ డివిజన్లుగా విభజించారు. ప్రతి సబ్ డివిజన్ కింద ఒక డీఈ పరిధిలో 13 నుంచి 18 మంది లస్కర్‌లు ఆయకట్టు విస్తీర్ణం ప్రకారం పనిచేశారు. కొన్ని ఏళ్లుగా కొత్తగా లస్కర్ల నియామకం జరగకపోవడంతో ప్రస్తుతం జిల్లా మొత్తంలో కేవలం 25 మంది లస్కర్లు మాత్రమే పనిచేస్తున్నారు. జిల్లాకు మొత్తం 170 మంది వరకు లస్కర్ల అవసరం ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారు పోను మిగిలిన వారిని భర్తీ చేయడానికి ఉన్నతాధికారులు నీటిపారుదల శాఖలో 12 మంది డీఈల నుంచి వివరాలు తీసుకున్నారు. ప్రస్తుతం కాలువల పర్యవేక్షణ కోసం పనిచేస్తున్న సీనియర్ లస్కర్‌కు నీటిపారుదల శాఖలో జేఈతో సమానంగా వేతనం దాదాపు రూ. 50 వేల వరకు ఉంటుందని తెలిసింది. ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తామని ప్రకటించడంతో, వీరిలో ఎక్కువ మందిని లస్కర్లుగా నియమించే అవకాశం ఉన్నట్లు ఓ డివిజన్ స్థాయి అధికారి పేర్కొన్నారు.

చిత్ర కథ: వర్షపు నీరు కాదు.. పైపులైన్ లీకేజీ



ఈ నీరంతా వర్షం నీరు అనుకునేరు. రోడ్డుపై ఉన్న పైపులు లీకేజీ కావడంతో నీరంతా దారలా ప్రవహిస్తుంది. దీంతో రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మపురి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బస్టాండ్ ప్రాంతంలో మూడు రోజులుగా రోడ్డుపై నీరంతా ప్రవహిస్తోంది. పైపులు పలుచోట్ల లీకేజీ కావడంతో నీరంతా రోడ్డుపై చేరి మడుగులను తలపిస్తోంది. రోడ్డుపై వెళ్తున్న వాహన దారులపై ఈ నీరు పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా నీరు నిలిచి ఉండడంతో ఈగలు, దోమలు చేరి దుర్గంధంగా తయారైంది. సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణం పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- ధర్మపురి

సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించాల్సిన అధికారి:
రమేశ్ - మున్సిపల్ కమిషనర్, సెల్ : 88866 49051

క్లుప్తంగా

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ పరిశీలన



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో కమిషనర్,సిబ్బంది

కోరుట్ల: పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఎండీ. అయాజ్ శనివారం పరిశీలించారు. స్వచ్ఛ భారత్ 2023 'మేరీ లైఫ్ మేరా షహర్'లో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20 వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం వరకు కొనసాగుతుందన్నారు. ఈ కేంద్రాల్లో ప్రజలు తమ ఇండ్లల్లోని పాత పేపర్, పుస్తకాలు, నోట్‌బుక్స్, పాత ప్లాస్టిక్ వస్తువులు, బట్టలు, వంటి వస్తువులను జమ చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మహేశ్, మెప్మా ఇన్‌చార్జి సంధ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జక్కాపూర్ సమీకృత మార్కెట్ సందర్శన



మార్కెట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

రాయికల్: సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌లోని సమీకృత మార్కెట్‌ను మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కౌన్సిలర్ మ్యాకల కాంతారావు, భూపతిపూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ, రాయికల్‌లో నిర్మించబోయే సమీకృత మార్కెట్‌ను జక్కాపూర్ మార్కెట్‌లో మాదిరిగా నిర్మిస్తామని తెలిపారు.

సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెగడపల్లి: మండల కేంద్రంలో ఎస్సీ బాలుర హాస్టల్‌కు పక్కా భవనం నిర్మాణం కోసం రూ. 2 కోట్లు మంజూరు కావడంపై మండల బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్‌ల చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా 11, 12 వార్డుల్లో మురికికాలువల్లోని చెత్తాచెదారం తొలగించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ పాల్గొన్నారు.

గౌడ సత్రం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కథలాపూర్: వేములవాడలో గౌడ సత్రం నిర్మాణం కోసం శనివారం మేడిపెల్లి గ్రామ గౌడ సంఘం తరుపున రూ.1 లక్ష విరాళం అందించారు. ఈ మేరకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు మేడిపెల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సంఘం సభ్యులు రూ.లక్ష ఇచ్చారు. కార్యక్రమంలో బొంగోని రాజాగౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ముగిసిన యోగా మహోత్సవం



వ్యవసాయ కళాశాల విద్యార్థినులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న యోగా మహోత్సవం శనివారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమాలు విద్యార్థులకు చాలా ఉపయోగపడుతాయని చెప్పారు. యోగాతో శరీరంలోని అవయవాలు పునరుత్తేజం చెందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మంచాల కృష్ణ, అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారయణ్ భట్, రెడ్‌క్రాస్ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్, యోగా శిక్షకుడు సుధాకర్, రాయికల్ సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు బాల ముకుందం, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రాయికల్: మండలంలోని దావన్‌పల్లిలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని-తిరుపతి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, సర్పంచ్ యమున, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు పాత వస్తువులు అందజేయాలి



పాత వస్తువులను అందిస్తున్న స్థానికులు

మెట్‌పల్లి: ఇంట్లో వినియోగించని పాత వస్తువులను మున్సిపల్ కార్యాలయంలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అందజేయాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని 5 వార్డులో శనివారం సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాత వస్తువులను బయట పడేయవద్దని, వాటిని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అందిస్తే పేదలకు పంపిణీ చేస్తామన్నారు. అలాగే తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధుల ప్రబలే అవకాశముంటుందని, ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లంక గంగాధర్, సిబ్బంది విష్ణు, ముజీబ్, గంగరాణి తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సత్యనారాయణను సన్మానిస్తున్న టీజీవో నాయకులు

జగిత్యాలరూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్సారెస్పీ గెస్ట్‌హౌస్‌లో మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిలు, బదిలీలు, మండల పంచాయతీ అధికారులకు వాహన అలవెన్స్‌లపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ నగదు రహిత చికిత్సలకు ఉత్తర్వులు విడుదల చేస్తుందన్నారు. అనంతరం జగిత్యాల జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘ భవనానికి స్థలం కేటాయించినందుకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్కారి శాఖ అధ్యక్షుడు రవీందర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, కోశాధికారి గణేశ్, ఎంపీవోల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వాలీబాల్ పోటీల్లో ఎండపల్లి క్రీడాకారిణుల ప్రతిభ

వెల్గటూర్: ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల వాలీబాల్ పోటీల్లో మహిళా విభాగంలో ఉమ్మడి వెల్గటూర్ మండలం ఎండపల్లి టీం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. టీం నుండి ఐదుగురు క్రీడాకారిణులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. గెలుపొందిన టీం సభ్యులను సర్పంచ్ మారం జలంధర్‌రెడ్డి శనివారం సన్మానించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఖర్చులకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మారపల్లి రవీందర్‌రెడ్డి, సబ్బ సంతోష్, సిలువేరి రవి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం పనులు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ధర్మసాగర్ కాలనీలో రూ. 11 లక్షలతో నిర్మిస్తున్న స్టేడియం పనులను శనివారం తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభు పరిశీలించారు. వారం రోజులుగా స్టేడియంలో ట్రాక్టర్లతో మొరంపోసి రూలింగ్ చేస్తున్నందున పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మినీ స్టేడియం పూర్తయిన తర్వాత క్రీడాకారులు ప్రాక్టీస్ చేసి రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. స్టేడియం వద్ద ఓపెన్ జిమ్, చిన్న పిల్లల పార్క్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, ఉప సర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణ, మండల కొఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత రాజ్‌పాల్, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూకు నివాళి

కోరుట్లటౌన్: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కార్యదర్శి మ్యాకల నర్సయ్య, ఎంబేరి సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని జవహర్‌రోడ్ చౌరస్తాలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏఆర్ అక్బర్, రజియోద్దీన్, గంగాధర్, రహీం, ఫక్రోద్దీన్, రఘు, నరేశ్, షకీల్ పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, అందె మారుతి, ఇల్లెందుల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఓదార్పు

వెల్గటూర్: మండలంలోని రాజక్కపల్లి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు దోరిశెట్టి వెంకటయ్య సతీమణి దోరిశెట్టి శంకరమ్మ (68) అనారోగ్యంతో గురువారం మరణించారు. ఆమె అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో నిర్వహించగా మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు అంతిమ యాత్రలో పాల్గొని వెంకటయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి రమణారావు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయ కిరాణం సామగ్రి అమ్మకానికి వేలం

కొండగట్టు: కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద రెండేళ్లపాటు కిరాణం సామగ్రి అమ్ముకునేందుకు శనివారం వేలం నిర్వహించారు. నాచుపెల్లి గ్రామానికి చెందిన బోజనపెల్లి శ్రవన్‌కుమార్ రూ.6.99 లక్షలకు టెండర్ దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో ఏ.మారుతి జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీరాజం, టెండర్ల ఇన్‌స్పెక్టర్ రవికిషన్, టెండర్ దారులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

మల్యాల: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు.మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కొండ శేఖర్, నూకపల్లిలో రైతు రాయిల్ల గంగాధర్ ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని, ఆపదలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అజారొద్దీన్, పొన్నం మల్లేశం,నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను శనివారం ఎస్సై చిర్ర సతీశ్ కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించి కోరుట్లకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీలు వెంకట్‌రెడ్డి గంగాధర్, చిలుక లక్ష్మీ నారాయణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల వాలీబాల్ సెక్రటరీ ఎంఏ. బారి, మండల హ్యాండ్ బాల్ ప్రెసిడెంట్ గిన్నెల విద్యాసాగర్, సెక్రటరి పెద్ద బోయిని శ్రీనివాస్, బీఆర్‌ఎస్ యూత్ కార్యదర్శి పుప్పాల నాగరాజు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

జ్యోతినగర్: మద్యానికి డబ్బులు ఖర్చయ్యాయని ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో దాడికి పాల్పడిన ఆరిఫ్ పాషాపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్‌కు చెందిన వేల వినోద్‌కుమార్, అతని స్నేహితుడు ఆరిఫ్ పాషాలు శుక్రవార రాత్రి మద్యం సేవించారు. ఆరిఫ్ వాళ్ల ఇంట్లో డబ్బులు ఎందుకు ఖర్చు చేశావు అని శనివారం గొడవ జరగడంతో వినోద్‌తో మద్యం తాగడంతోనే ఖర్చయిందని కోపంతో అతడిపై బండరాయితో దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

ధర్మపురి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023 మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, ఇతర అంశాల గూర్చి చర్చించారు. మార్కెట్ కార్యాలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్లు నరేశ్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అక్కెనపెల్లి సునీల్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, కార్యదర్శి భూమన్న, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అధికారులకు అవగాహన

జగిత్యాల: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా ప్రొక్యూర్‌మెంట్ అధికారులుగా నియమితులైన జిల్లా స్థాయి అధికారులకు శనివారం అవగాహన కల్పించినట్లు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి డీడీ గోపాలకృష్ణ తెలిపారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ఓ అంగడిలో గొర్రెలకు సంబంధించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. గొర్రెల ఆరోగ్యం, మేలు జాతి గొర్రెల ఎంపిక, వ్యాధి లక్షణాలు, గొర్రెల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

మల్లాపూర్: భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబెడ్కర్ ఆశయ సాధనకై తన జీవితాన్నే త్యాగం చేసిన త్యాగమూర్తి రమాబాయి అంబేడ్కర్ అని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, మండల ఉపాధ్యక్షుడు జంగం దినేశ్ అన్నారు. రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని సిరిపూర్, సంగెం-శ్రీరాంపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమాలలో నాయకులు దయ్య రఘువీర్, మోర్తాడ్ అన్వేష్, లవణ్, మల్లేష్, సాయికృష్ణ, రాహుల్, రవి, ప్రణయ్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: రమాబాయి అంబేడ్కర్ వర్ధింతి సందర్భంగా మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో మండల అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మారంపల్లి లక్ష్మణ్, మల్యాల సతీశ్ కుమార్, ముప్పారపు రవీందర్, నలువాల సంజీవ్, దొనకొండ కాంతయ్య, మల్యాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ధర్మపురి: గ్రామపంచాయతీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కో-కన్వీనర్ ముడుగం రాజలింగు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు, స్వీపర్స్, ఎలక్ట్రీషియన్ తదితరులు తక్కువ వేతనంతో ఎక్కువ పనిభారం మోస్తున్నారని ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు ఏ మూలకు సరిపోవడం లేదని ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికుల సమస్యలు, వేతనాలను పెంచాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సర్పంచ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు నల్ల సునిత, గంగన్న, కమల, గంగాధర్ తదితరులున్నారు.

పెగడపల్లి వాసికి డాక్టరేట్

పెగడపల్లి:మండల కేంద్రానికి చెందిన బత్తుల ప్రదీప్ అనే యువకుడు ఢిల్లీలోని గ్లోబల్ పీస్ ఆఫ్ హ్యూమానిటీ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ప్రదీప్ చేపడుతున్న సామాజిక సేవలను గుర్తించిన గ్లోబల్ యూనివర్శిటి వారు డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో శనివారం గ్లోబల్ పీస్ ఆఫ్ హ్యూమనిటీ యూనివర్శిటీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ మాన్యూల్, తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి వేంకటేశన్, కేంద్ర మంత్రి డాక్టర్ రాందాస్ అథావలె, ప్రిన్సిపాల్ సెక్రటరీ చేతుల మీదుగా ప్రదీప్‌కు డాక్టరేట్ అందుకున్నారు.

'ఫీజుల దోపిడీ అరికట్టాలి'

గొల్లపల్లి: రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు కళాశాలల్లో ఫీజుల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని సామాజిక కార్యకర్త ఉప్పులేటి నరేశ్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు రాష్ట్రంలో ఇష్టానుసారంగా లక్షల రూపాయల ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం మేధావులు, విద్యార్థి సంఘాలతో, సామాజిక బాధ్యత కలిగినవారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్న విద్యాసంస్థలపై యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని నరేశ్ పేర్కొన్నారు.

టీఎన్జీవీ జిల్లా కార్యవర్గ సమావేశం

జగిత్యాల: జగిత్యాల జిల్లా పశువైద్య (టీఎన్జీవీ) జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక ఏరియా పశువైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లకు లైవ్ స్టాక్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. మౌలికవసతులు అందుబాటులో ఉంచాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ నాయకులు ఆనంద్, రాజకుమార్,నాగేందర్‌రెడ్డి, కోశాధికారి గణేష్, సభ్యులు పాల్గొన్నారు.


చేప ఉత్పత్తుల ఆహార మేళ

జగిత్యాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని శుభమస్తు టౌన్ హాల్‌లో జూన్ 8, 9, 10 తేదీల్లో చేప ఉత్పత్తుల ఆహార మేళా నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారి దామోదర్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి వివిధ రకాల చేపలు, రొయ్యలు, ప్రత్యేక వంటల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వంటకాల్లో అనుభవం, శిక్షణ గల వారు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఇందులో పాల్గొనే వారు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

బీసీల చైతన్యమే 'జన అధికార సమితి' లక్ష్యం

మల్లాపూర్: అన్నిరంగాల్లో వెనుకబడిన «బీసీ» లను చైతన్యం చేయడమే తమ లక్ష్యమని జన అధికార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్‌లో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సాంబారి ప్రభాకర్ ఆధ్వర్యంలో జన అధికార సమితి నిర్వహించిన సబ్బండ వర్గాల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో బీసీలను రాజకీయ నాయకులు అణచివేతకు గురిచేస్తుండడంతో వారు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా అత్యధిక జనాభా బీసీలదేనని, వారిలో ఐక్యత లేక ఎదగలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలను ఏకం చేసి ఒక్కతాటిపైకి తీసుకురావడం కోసమే జన అధికార సమితి ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. అంతకుముందు గద్దం రమేశ్ కళాబృందం జానపద పాటలు ప్రజలను అకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సాంబారి ప్రభాకర్, జన అధికార సమితి రాష్ట్ర సభ్యుడు రౌతు మహేశ్, బీసీ నాయకులు ముద్దం సత్యనారాయణగౌడ్, పుప్పాల మహేశ్, ఇల్లెందుల వేణుగోపాల్‌చారి, రమేశ్, బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కథలాపూర్: బీమారం మండలంలోని మన్నెగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 2005-06 సంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు శనివారం సమావేశం నిర్వహించుకున్నారు. 17 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య ఆట, పాటలతో సందడి చేశారు. అప్పట్లో పాఠశాలలో చేసిన చిలిపి చేష్టలు గుర్తు చేసుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేసి సమావేశం ముగించారు.